రక్త పరీక్షలు వేగంగా చేయాలి

ప్రజాశక్తి - ఏలూరు టౌన్

ప్రస్తుత వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు వ్యాధులబారిన పడే అవకాశం ఉందని, ల్యాబ్ టెక్నీషియన్లు విధిగా రక్తపరీక్షలు చేసి ఫలితాల రిపోర్టులు త్వరితగతిన అందించాలని జిల్లా మలేరియా నియంత్రణ అధికారి పిఎస్.ప్రసాద్ సూచించారు. ముఖ్యంగా డెంగీ, మలేరియా పరీక్షలు అధికంగా చేయాలన్నారు. స్థానిక జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి సమావేశ మందిరంలో జిల్లాస్థాయి ల్యాబ్ టెక్నీషియన్ల సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వర్షాకాలంలో ప్రజలు జ్వరాలతో బాధపడతారని, ముందుగా రక్త పరీక్షలు చేసి ఆ తర్వాత వైద్య సేవలందించాలని సూచించారు. అనంతరం డెంగీ నివారణ మాసోత్సవంలో భాగంగా ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ మలేరియా అధికారి జె. గోవిందరావు, డెమో -విజయ్, ఎంపిహెచ్ఇఒ రవికుమార్, ఎంపిహెచ్ఎస్ నాగమల్లేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

ఫలించిన 'పోరుకేక'

మారిన పోలవరం కాంటూరు లెక్కలు
41.15 కాంటూరులోకి
19 గ్రామాలు చేరిక
3,480 కుటుంబాలకు ఊరట
పరిహారంగా నిర్వాసితులకు
అందనున్న రూ.238.69 కోట్లు
సిపిఎం మహా పాదయాత్రతో
దిగొచ్చిన ప్రభుత్వం

జిల్లాలో పోరుకేక పాదయాత్ర (ఫైల్‌ఫోటో)

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

సిపిఎం చేపట్టిన 'పోలవరం పోరుకేక' మహా పాదయాత్రతో ప్రభుత్వం దిగొచ్చింది. పోలవరం కాంటూరు లెక్కల్లో పలు గ్రామాలకు సంబంధించిన మార్పులపై స్పష్టమైన ప్రకటన చేసింది. ఇప్పటి వరకూ 45.72 కాంటూరులో ఉన్న కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లోని 19 గ్రామాలను 41.15 కాంటూరులో చేర్చింది. చేర్చిన వాటిలో వేలేరుపాడు మండలంలో తొమ్మిది గ్రామాలు, కుక్కునూరు మండలంలో పది గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాల్లో మొత్తం గిరిజన కుటుంబాలు 1,443, గిరిజనేతర కుటుంబాలు 2,037 ఉన్నాయి. కాంటూరు మార్పుతో రెండు మండలాల్లో మొత్తం 3,480 కుటుంబాలకు ఊరట లభించనుంది. పరిహారం కింద రూ.238.69 కోట్లు ఇవ్వనున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం మూడు కాంటూరులుగా విభజించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణ ప్రాంత గ్రామాలను మొదటి కాంటూరులో చేర్చగా రెండో విడత ఖాళీచేసే గ్రామాలను 41.15 కాంటూరులో, మిగిలిన గ్రామాలను 45.72 కాంటూరులో చేర్చింది. 2022 వరదలకు ప్రభుత్వం ప్రకటించిన కాంటూరు లెక్కలతో సంబంధం లేకుండా గ్రామాలన్నీ ముంపునకు గురయ్యాయి. దీంతో ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో లైడార్ సర్వేతో కాంటూరు లెక్కలు మరోసారి తేలుస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

లైడార్ సర్వే అనంతరం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 18 గ్రామాలను 41.15 కాంటూరులో చేరుస్తున్నట్లు ప్రకటించి కొద్దిరోజుల తర్వాత మళ్లీ మాటమార్చింది. దీంతో నిర్వాసితుల నుంచి తీవ్ర ఆగ్రహావేశాలు వ్యక్తమయ్యాయి. నిర్వాసితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలంటూ జూన్ 20న అల్లూరి జిల్లా ఎటపాక మండలం నెల్లిపాక నుంచి ప్రారంభమైన సిపిఎం మహాపాదయాత్ర ఈ నెల నాలుగో తేదీన విజయవాడ చేరుకున్న సంగతి తెలిసిందే. ఈ యాత్రకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు నేతృత్వం వహించారు. రాజకీయ పార్టీల నుంచి, ప్రజాసంఘాల నుంచి పెద్దఎత్తున మద్దతు లభించింది. రాష్ట్ర, జాతీయ నాయకులు ఈ పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలిపారు. దీంతో ప్రభుత్వం ఒక అడుగు వెనక్కేసింది. 45.72 కాంటూరులో ఉన్న 19 గ్రామాలను 41.15 కాంటూరులో చేరుస్తున్నట్లు బుధవారం స్పష్టమైన ప్రకటన చేసింది. ఇంకా నిర్వాసితులకు సంబంధించిన అనేక అంశాలపై ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాల్సి ఉంది.

41.15 కాంటూరులో చేర్చిన గ్రామాలు

వేలేరుపాడు మండలంలోని గ్రామాలు;

1.కాకిసనూరు, 2.పెదమానుకొల్లు, 3.తూర్పుమెట్ట, 4.టేకూరు, 5.కాచారం, 6.ఎర్రమెట్ట, 7.యడవల్లి, 8.పేరంటాలపల్లి, 9.టేకుపల్లి

కుక్కునూరు మండలంలోని గ్రామాలు;

1.కౌండిన్యముక్తి, 2.మాధవరం, 3.యల్లప్పగూడెం, 4.బెస్తగూడెం, 5.ఆంబోతులగూడెం, 6.చెరువుకొమ్ముగూడెం, 7.ఎర్రబోరు, 8.గుండమ్మబోరు, 9.ముత్యాలంపాడు, 10.రావిగూడెం

వరద ముంపు ఆధారంగా గ్రామాలను గుర్తించాలి

ఎ.రవి, సిపిఎం జిల్లా కార్యదర్శి

ఇప్పటికైనా ప్రభుత్వం పలు ముంపు గ్రామాలకు సంబంధించి కాంటూరు మార్పు చేయడం మంచి పరిణామం. ముంపు గ్రామాల ఎంపిక అశాస్త్రీయంగా కాకుండా శాస్త్రీయంగా చేపట్టాలి. 1986, 2022 వరదల ప్రాతిపదికన ముంపు గ్రామాల గుర్తింపు జరగాలి. గుర్తించని గ్రామాలను వెంటనే చేర్చాలి. నిర్వాసితులకు పరిహారం వెంటనే అందించాలి.

పోరాట ఫలితమే మొదటి పరిహారపు జాబితాలోకి 10 గ్రామాలు

యర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఎం కుక్కునూరు మండల కార్యదర్శి

సిపిఎం పోరాట ఫలితంగా 10 గ్రామాలు మొదటి పరిహారపు (41.15 కాంటూరు) జాబితాలోకి చేర్చారు.దీనిపై హర్షం వ్యక్తం చేస్తున్నాం. మండలం మొత్తాన్ని యూనిట్‌గా తీసుకుని పరిహారం చెల్లించాలి. గోదావరి వరదలకు దెబ్బతిన్న ఇళ్లకు నష్టపరిహారం చెల్లించాలి. నిర్వాసితుల సమస్యలన్నీ పరిష్కరించాలి.

గాడిన పడని ప్లస్ టూ..!

హైస్కూళ్లలో ప్లస్ టూ మహిళా కళాశాలల దుస్థితి
సౌకర్యాలు లేమినే విద్యార్థుల విముఖతకు కారణం
గతేడాది ఉమ్మడి జిల్లాలో 13.65 శాతమే ఉత్తీర్ణత
36 ప్లస్ టూ స్కూళ్లలో ఈ ఏడాది చేరింది 373 మందే
బోధనా సిబ్బందిని నియమించినా అవగాహన కల్పనలో విఫలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

ప్రతి మండలంలోనూ ఒక హైస్కూల్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్లస్ టూ (మహిళా కళాశాల) విద్య రెండో ఏడాదీ గాడిన పడని దుస్థితి నెలకొంది. తొలిఏడాది బోధనా సిబ్బంది, పాఠ్యపుస్తకాలు, ల్యాబ్‌లు వంటి వసతులేవీ ఏర్పాటు చేయకుండా తరగతులు ప్రారంభించడం విద్యార్థులకు శాపంగా పరిణమించింది. దీంతో రెండో ఏడాది 2023-24 ఏడాదికి సంబంధించిన విద్యా సంవత్సరంలోనూ పెద్దగా విద్యార్థులు చేరని పరిస్థితి ఏర్పడింది. ప్లస్ టూ విద్యపై ప్రభుత్వం వ్యవహరించిన తీరు ప్రస్తుత పరిస్థితికి కారణమని చెప్పొచ్చు. పదో తరగతి పూర్తయిన బాలికలు మధ్యలోనే చదువు ఆపేయకుండా ప్రభుత్వం మండలానికి ఒక హైస్కూల్‌లో ప్లస్ టూ కింద ఇంటర్ విద్యను ప్రవేశ పెట్టింది. 2022-23 సంవత్సరంలో దీనికి అంకురార్పరణ చేసింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 36 ప్లస్ టూ మహిళా కాలేజీలకు అనుమతిచ్చి హడావుడిగా ప్రారంభించింది. ప్రథమ సంవత్సరం ఇంటర్ విద్యలో ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 359 మంది విద్యార్థులు మాత్రమే చేరారు. ప్లస్ టూను సమర్థవంతంగా నిర్వహించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నమ్మకం పెంచాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించింది. పాఠాలు చెప్పేందుకు అధ్యాపకులను నియమించకుండా హైస్కూల్ ఉపాధ్యాయులనే పాఠాలు బోధించాలని చెప్పి చేతులు దులుపుకుంది. హైస్కూళ్లలో సబ్జెక్టు టీచర్లు లేకపోవడంతో పూర్తిగా ప్లస్ టూ చదువు అటకెక్కింది. ల్యాబ్‌లుగాని, పాఠ్యపుస్తకాలుగాని ఏఒక్కటీ విద్యార్థినులకు అందుబాటులో లేకుండాపోయాయి. దీంతో ఏప్రిల్ 26న వచ్చిన ఇంటర్ ఫలితాల్లో ప్లస్ టూ విద్యార్థినులు ఫలితాల సాధనలో చతికిలబడ్డారు. ఉమ్మడి జిల్లాలో 36 కాలేజీల నుంచి 359 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు రాయగా కేవలం 49 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. అంటే 13.65 శాతం మాత్రమే ఉత్తీర్ణత నమోదైంది. పలు ప్లస్ టూ స్కూళ్ల నుంచి పరీక్షకు హాజరైన విద్యార్థినుల్లో ఒక్కరు కూడా ఉత్తీర్ణత సాధించని దుస్థితి నెలకొంది. చాలా ప్లస్ టూ స్కూళ్ల నుంచి ఒక్కరు కూడా పాస్ కాలేదు. పాఠాలు బోధించే అధ్యాపకులు లేకపోవడం, పాఠ్యపుస్తకాలు ఇవ్వకపోవడం వంటి పలు కారణాలతో ఈ దుస్థితి దాపురించింది. దీంతో తల్లిదండ్రులు, విద్యార్థినులు ప్లస్ టూ స్కూళ్లపై నమ్మకం కోల్పోయారు.

ఈ ఏడాదీ విద్యార్థినుల సంఖ్య నామమాత్రమే

2023-24కు సంబంధించి ప్లస్ టూ స్కూళ్లలో చేరిన విద్యార్థినుల సంఖ్య నామమాత్రంగానే ఉంది. ఇప్పటి వరకూ ప్లస్ టూలో మొదటి సంవత్సరం 373 మంది చేరగా, రెండో ఏడాదికి సంబంధించి 320 మంది విద్యార్థినులు చేరారు. ప్రభుత్వం ప్లస్ టూలో మూడు గ్రూపులను ప్రవేశ పెట్టింది. ఎంపిసి, బైపిసి, సిఇసి గ్రూపులు ఉన్నాయి. ప్రతి గ్రూపునకూ కనీసంగా 20 మందికి తక్కువ కాకుండా ఉండాల్సి ఉంది. ఆ విధంగా చూస్తే మొదటి ఏడాదికి సంబంధించి 2,160 మంది, రెండో ఏడాది విద్యార్థినుల సంఖ్య 2,160 మొత్తం 4,320 మంది ఉండాల్సి ఉంది. అయితే ప్రస్తుతం ఇంటర్ రెండు సంవత్సరాల విద్యార్థినులను కలిపినా 701 మంది మాత్రమే ఉన్నారు. ప్లస్ టూలో విద్యాబోధనపై తల్లిదండ్రులు నమ్మకం కోల్పోవడమే దీనికి కారణం.

లెక్చరర్లు ఫుల్.. విద్యార్థినులు పరిమితం

గతేడాది ప్లస్ టూలో పాఠాలు బోధించే లెక్చరర్లు లేకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడటమే కాకుండా పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించలేకపోయారు. దీంతో ఈ ఏడాది లెక్చరర్ల నియామకంపై ప్రభుత్వం దృష్టి సారించింది. పీజీ చదివిన ఉపాధ్యాయులను ప్లస్ టూ లెక్చరర్లుగా ప్రభుత్వం ప్రమోట్ చేసింది. మొత్తం 252 మంది లెక్చరర్లు అవసరం ఉండగా ఇప్పటికే 234 మందిని నియమించింది. అయితే విద్యార్థినుల సంఖ్య మాత్రం లేకుండాపోయింది. పలుచోట్ల ప్లస్ టూ స్కూళ్లలో లెక్చరర్లు ఉన్నా విద్యార్థులు ఒక్కరు కూడా లేరని చెబుతున్నారు. ప్రభుత్వం లెక్చరర్ల నియామకం, అందుబాటులోనే ఇంటర్ విద్య తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించకపోవడమే దీనికి కారణంగా చెప్పొచ్చు. దీంతో ప్లస్ టూ విద్యాలయాలు గాడిన పడేదెప్పుడో తెలియని దుస్థితి నెలకొంది.

ఉపకరణాల కోసం 38 మంది రిజిస్ట్రేషన్

ప్రజాశక్తి - పోలవరం

వికలాంగులకు అవసరమైన పరికరాల కోసం ముందుగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఎంపిడిఒ జి.శ్రీను అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం వికలాంగుల గుర్తింపు శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరానికి మండలంలోని వికలాంగులు వారికి కావాల్సిన ఉపకరణాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా వికలాంగుల పునరవాస కేంద్రం కో ఆర్డినేటర్ డి.శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పునరవాస కేంద్రం ద్వారా ఆడియాలజీ, సైకాలజీ, ఫిజియోథెరపీ, యుడిఐడి సేవలు అందుబాటులో ఉన్నాయని, వినియోగించుకోవాలని సూచించారు. ఈ శిబిరంలో 38 మంది పరికరాల కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు.

సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అధికారులు

ట్రిపుల్ ఐటిలో కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

నూజివీడు పట్టణంలోని ట్రిబుల్‌ఐటిలో స్పెషల్ కేటగిరి అడ్మిషన్ల కోసం విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన బుధవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా ఆర్‌జియుకెటి ఛాన్సలర్ ఆచార్య కేసిరెడ్డి మాట్లాడుతూ మొత్తం 39 వేల దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇందులో నాలుగు క్యాంపస్‌లకు గాను నాలుగు వేల సీట్లు అందుబాటులో ఉన్నాయన్నారు. ప్రతిభ కలిగిన విద్యార్థులు రిజర్వేషన్ ప్రాతిపదికన సీట్లు కేటాయిస్తామని తెలిపారు.

భూస్వాముల సాగును అడ్డుకున్న గిరిజనులు

ఎర్రకాలువ మిగులు భూముల్లో

సాగుకు భూస్వాముల యత్నం

అడ్డుకున్న గిరిజనులు - వెనుదిరిగిన ఆక్రమణదారులు

ప్రజాశక్తి - టి. నరసాపురం

మండలంలోని ఎర్రకాలువ మిగులు భూముల్లో ట్రాక్టర్‌తో దుక్కులు దున్నుతున్న భూస్వాములను వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మండలంలోని సాలిగూడెం, అబ్బుల్లాపురం తదితర గ్రామాలకు చెందిన గిరిజనులు బుధవారం అడ్డుకున్నారు. దీంతో గిరిజనులకు భూస్వాములకు మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తుమ్మల సత్యనారాయణ మాట్లాడుతూ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఎర్రకాలువ రిజర్వాయర్ మిగులు భూముల్లో 2018లో అనేక పోరాటాలు, ఉద్యమాల ద్వారా మిగులు భూముల్లో సాగు చేస్తున్నారన్నారు. ప్రతీ ఏడాది సాగు చేస్తున్నారని ఈ క్రమంలో ఈ సంవత్సరం సీజన్లో కూడా సాగు చేపట్టేందుకు సిద్ధపడుతున్నారని మరో వారంలో సాగు పనులు చేపట్టనున్న నేపథ్యంలో కొందరు భూస్వాములు కొబ్బరి ముక్కలు వేయటానికి ట్రాక్టర్‌తో దున్నటానికి ప్రయత్నిస్తుండగా అడ్డుకున్నామని తెలిపారు. దీంతో భూస్వాములు వెళ్లిపోయారని తెలిపారు. ఐదేళ్లుగా మిగులు భూముల్లో సాగు చేస్తున్న గిరిజనులకు హక్కు పత్రాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు.

బీమాపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - మండవల్లి



బీమా చెక్కును అందిస్తున్న బ్యాంకు మేనేజర్

బీమాపై అవగాహన లేక ఖాతాదారులు ప్రమాద సమయంలో ఆర్థిక భరోసా పొందలేక నష్టపోతున్నారని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ బొంతు దుర్గారావు అన్నారు. ఆనందపురంలో ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనలో చేరి మృతి చెందిన చప్పిడి లూర్దుమాతకు నామినీగా ఉన్న కుమారుడు రాజేష్‌కు రూ.2 లక్షల ప్రమాద బీమా చెక్కును ఆయన బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కసారి బీమాలో చేరితే ఆటో డెబిట్ ద్వారా సొమ్ము జమ అవుతూనే ఉంటుందన్నారు. లూర్దుమాత బీమాలో చేరిందని తెలియకపోవడంతో ఆమె మృతి చెంది మూడు సంవత్సరాలు గడుస్తున్నా క్లెయిమ్ అవ్వలేదని తెలిపారు. బీమాతో ఎన్నో లాభాలున్నాయని, బీమాను తప్పనిసరిగా ప్రతిఒక్కరు కలిగి ఉండాలని కోరారు. ప్రధానమంత్రి జీవన్ జ్యోతి బీమా యోజనకు సంవత్సరానికి రూ.436 రెండు పాలసీలకు కలిపి రూ.456 చెల్లిస్తే సహజ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాద మరణానికి మరో రూ.రెండు లక్షలు మొత్తం రూ.నాలుగు లక్షలు బీమా వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సభ్యులు ఎల్ఎస్ భాస్కరరావు, హెచ్ఎంజి శ్యామల, ప్రకాశరావు, రేమల్లి జస్సిల్యా, సుధారాణి, శిరీష, రాంబాబు, కోటేశ్వరరావు, పద్మరాజు, గాబ్రియల్ డ్వాక్రా గ్రూపు మహిళలు పాల్గొన్నారు.

17న మినీ జాబ్‌మేళా

ఏలూరు: జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయం, నేషనల్ కెరీర్ సర్వీసు (ఎన్‌సియస్), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ యువజన సర్వీసుల శాఖ, సెట్ వెల్, ఏలూరు వారి సంయుక్త ఆధ్వర్యంలో మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి సి.మధుభూషణరావు, సెట్ వెల్ ముఖ్య కార్యనిర్వాహణాధికారి ఎమ్‌డి హెచ్.మెహ్రాజ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల ఏడో తేదీ ఉదయం 10.30 గంటలకు సెట్ వెల్ కార్యాలయం, కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఈ జాబ్ మేళా నిర్వహింస్తున్నామన్నారు. ఈ మేళాకు ఇంటర్వ్యూలు నిర్వహించేందుకు ఈ దిగువ తెల్పిన కంపెనీల ప్రతినిధులు హాజరుకానున్నారని తెలిపారు. సిఎంఆర్ జ్యూయలరీ, మోహన్ స్పిన్ టెక్స్‌లలో పనిచేసేందుకు ఆసక్తి ఉన్నవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు జి.ప్రవీణ్‌కృష్ణ, నేషనల్ కెరీర్ సర్వీసు (ఎన్‌సియస్) జిల్లా కోఆర్డినేటర్ (ఫోన్: 9494490990) ను సంప్రదించాల్సిందిగా మెహ్రాజ్ తెలిపారు.

భూమి వద్ద మోహరించిన పోలీసులు

వివాదాస్పద భూమిలో సాగు అడ్డగింత

టి.నరసాపురం: అల్లంచర్లరాజుపాలెం పంచాయతీ పరిధిలోని కొత్తగూడెంలో సర్వేనెంబరు 226 వివాదాస్పద భూమిలో స్థానిక రైతులు తమకు పట్టాలున్నాయంటూ బుధవారం సాగు చేపట్టడంతో అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ప్రభుత్వం 2005లో కాలనీ నిర్మాణానికి 12 ఎకరాల్లో స్థానికులకు పట్టాలిచ్చినప్పుడు కొంతమందికి సాగుకు పట్టాలిచ్చారన్నారు. సాగు చేస్తుంటే అటవీ శాఖ అధికారులు అడ్డుకోవడంతో కోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నామని వారు తెలిపారు.

నేడు కుక్కలకు ర్యాబిస్ వ్యాక్సినేషన్

భీమడోలు: భీమడోలు ప్రాంతీయ పశువైద్యశాలలో జునోసిస్ డే సందర్భంగా ఈనెల ఆరో తేదీన కుక్కలకు ఉచిత ర్యాబిస్ వ్యాక్సినేషన్ నిర్వహిస్తున్నట్లు పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఇక్కుర్తి సాయిరమేష్ తెలిపారు. కార్యాలయ పరిధిలోని భీమడోలు, ద్వారకాతిరుమల, ఉంగుటూరు మండలాల పరిధిలోని అన్ని పశు వైద్యశాలల వద్ద ఉచిత రాబిస్ వ్యాక్సిన్ వేస్తామని తెలిపారు. పశువుల నుంచి మనుషులకు సోకే ఈ వ్యాధి వల్ల ఏర్పడే ఇబ్బందులను గుర్తించిన శాస్త్రవేత్త లూయి పాశ్చర్ జూలై ఆరో తేదీన తొలిసారిగా ర్యాబీస్, వ్యాక్సిన్ వేసి దీనిని అదుపు చేశారని ,ఆయన సంస్మరణార్థం ప్రభుత్వం ఆయన పేర జునోసిస్ డే ను నిర్వహిస్తున్నట్టు తెలిపారు. రాబిస్ వ్యాక్సిన్ తీసుకోవడం వల్ల కుక్క కరిచినప్పటికీ కాటుకు గురైన వ్యక్తికి ప్రమాదం ఉండదని తెలిపారు . కుక్కలకు ఉచిత రాబిస్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం గురువారం ఉదయం నుంచి సాయంకాలం నాలుగు గంటల వరకూ కొనసాగుతుందన్నారు.

అర్హులందరికీ పథకాలందించేందుకే జగనన్న సురక్ష

ప్రజాశక్తి - భీమడోలు

ఎన్నికల హామీలను నూరుశాతం అమలు చేసిన ఘనత వైసిపిదేనని ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల వాసుబాబు అన్నారు. భీమడోలు సచివాలయం-1 పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. గ్రామ సర్పంచి పి.సునీతమాన్‌సింగ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వాసుబాబు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే పాలన తెచ్చిందన్నారు. దీనిద్వారా సుమారు 600 సేవలు ప్రజల వద్దకు వెళ్తున్నాయన్నారు. వీటి ద్వారా ప్రజలకు అవసరమైన వివిధ సేవలు అందడంతో పాటు పలు సమస్యలు పరిష్కారమయ్యాయని వివరించారు. ఈ కార్యక్రమానికి 488 దరఖాస్తులు వచ్చాయని, వీటిలో 44 దరఖాస్తుల పరిష్కారానికి టోకెన్లను అందజేశామని మండల ప్రత్యేక అధికారి డిఆర్‌డిఎ పీడీ ఆర్.విజయరాజు తెలిపారు. అనంతరం శాసనసభ్యులు పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ సిహెచ్.పద్మావతిదేవి, వైసిపి ప్రముఖులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



పోలవరం మండలంలో..

జీలుగుమిల్లి : అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష లక్ష్యమని అసిస్టెంట్ కలెక్టర్ అపూర్వ భరత్ అన్నారు. బుధవారం పి.అంకంపాలెంలో జరిగిన సురక్ష కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ పార్టీలకతీతంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలందించే కార్యక్రమమే జగనన్న సురక్ష లక్ష్యమని తెలిపారు. అనంతరం పరిసరాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కె.పొసమ్మ, ప్రత్యేక అధికారి పివిఎస్.నాయుడు, తహశీల్దార్ సుందర్‌సింగ్, ఎంపిడిఒ కృష్ణప్రసాద్, సర్పంచి బుద్ధా జగ్గారావు, ఎంపిటిసి నాలి శ్రీను, మాజీ సర్పంచి కె.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

జీలుగుమిల్లి మండలంలో..

పోలవరం: నియోజకవర్గ ప్రత్యేక అధికారి, ఐటిడిఎ పిఒ జివివి.సత్యనారాయణ ఆధ్వర్యంలో గూటాల సచివాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ జి.శ్రీను, తహశీల్దార్ బి.సుమతి, పోలవరం ఎంపిపి సుంకర వెంకటరెడ్డి, జెడ్‌పిటిసి కలుం హేమకుమారి, సర్పంచి ప్రసాద్, ఎంపిటిసి హరిరామకృష్ణ, వైసిపి మండల అధ్యక్షులు బుగ్గ మురళీకృష్ణ, కో ఆప్షన్ సభ్యులు మహ్మద్ అబ్దుల్ సలాం, సెక్రటరీ తాతి విజయకుమారి పాల్గొన్నారు.

భీమడోలులో..

మండవల్లి : అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరావు అన్నారు. గన్నవరం సచివాలయ పరిధిలో నిర్వహించిన సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం దరఖాస్తుదారులకు సర్టిఫికెట్లు అందించారు. రూ.ఐదు లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు ముంగర విజయనిర్మల, సర్పంచి గుడివాడ శ్రీదేవి, ఉపసర్పంచి కలగుట్ల ఆంజనేయులు, తహశీల్దార్ రాజకుమార్ పాల్గొన్నారు.


ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎంఎల్ఎ

నూజివీడులో గడపగడపకు మన ప్రభుత్వం

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని 29, 30 వార్డుల్లో ఎంఎల్ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు బుధవారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఎంఎల్ఎ ఇంటింటికి పర్యటించి ప్రభుత్వ సంక్షేమ పథకాలు వల్ల కలిగిన లబ్ధిని వివరించారు. స్థానిక సమస్యలు తెలుసుకొని వాటిని అధికారులకు దృష్టికి తీసుకెళ్లి తక్షణమే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

ఆ రోడ్డులో ప్రయాణమంటే అవస్థలే..

ప్రజాశక్తి - చింతలపూడి

. చింతలపూడి నుంచి యర్రగుంటపల్లికి వెళ్లే రోడ్డు పెద్ద పెద్ద గుంతలు పడి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కోంటున్నారు. వర్షం వస్తే రోడ్లపై గుంతలు నీరుతో నిండిపోయి, రోడ్డంతా చిత్తడై ప్రయాణికులు నానా ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి సమయంలో ద్విచక్ర వాహనానదారులు గుంతల్లో పడి ప్రమాదాల బారిన పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. ఈ రోడ్డులో రోజూ సీతానగరం ఫ్యాక్టరీకి పామయిల్ లోడుతో లారీలు వెళ్తుంటాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుకుంటున్నారు.

పౌష్టికాహారం అందిస్తున్న సర్పంచి

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మండవల్లి: అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని గర్భిణీలు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి మెండ జాన్సీ తెలిపారు. స్థానిక స్టేషన్ రోడ్‌లోని ఒకటవ అంగన్‌వాడీలో బాలింతలకు, గర్భిణీలకు అందించిన పౌష్టికాహార పంపిణీలో బుధవారం ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్నారులను అంగన్‌వాడీలకి పంపిస్తే క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు మంచి అలవాట్లు నేర్చుకుంటారన్నారు. మానసికంగా, శారీరకంగా దృఢంగా పెరగడంతో పాటు జ్ఞాపకశక్తి పెంపోందుతోందన్నారు. ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహార విలువ తెలియకపోవడం వల్ల చాలా మంది సద్వినియోగం చేసుకోలేకపోతున్నారన్నారు. అనంతరం పిల్లలకు ఐరన్ సిరప్ డ్రాప్లను వేసి బాలింతలకు, గర్భిణులకు గుడ్లు, పాలు, బాలామతం అందజేశారు. ఈ కార్యక్రమంలో కార్యకర్త సరస్వతి, మెండ సురేష్, ఆశాలు, వాలంటీర్లు పాల్గొన్నారు.

స్త్రీలకు చదువుకునే హక్కు కల్పించింది అంబేద్కర్

ప్రజాశక్తి - కాళ్ల

భారతదేశంలో స్త్రీలకు చదువుకునే హక్కు కల్పించిన వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని శాసనమండలి ఛైర్మన్ కొయ్యే మోషేనురాజు అన్నారు. కోలనపల్లి గ్రామంలో విజయవాడ ఎస్‌పి మోకా సత్తిబాబు ఆర్థిక సహకారంతో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని శాసనమండలి ఛైర్మన్ మోసేన్‌రాజు, డిసిసిబి ఛైర్మన్ పివిఎల్ నరసింహరాజు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో మోషేన్‌రాజు మాట్లాడుతూ గతంలో పరిశ్రమల్లో కార్మికులకు 12 గంటల పని విధానం ఉండేవి, ఎనిమిది గంటల చట్టం అమల్లోకి తీసుకొచ్చిన మహావ్యక్తి అంబేద్కర్ అన్నారు. పివిఎల్ నరసింహరాజు మాట్లాడుతూ ఆనాడు అణగారిన వర్గాల కష్టాలను చూసి అందరికీ సమాన హక్కులు కల్పించాలని రాజ్యాంగాన్ని రచించిన వ్యక్త అంబ్కేదర్ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి కొనకంచి సూర్య నారాయణమూర్తి, జెడ్‌పిటిసి సోమేశ్వరరావు, ఎంపిటిసి వేగేశ్న సత్యనారాయణరాజు, కోనా జోసెఫ్, సోడదాసి గంగయ్య, రెవరెండ్ జార్జి ముల్లర్ పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

పట్టుబడిన రేషన్ బియ్యం

రేషన్ నిల్వలపై విజిలెన్స్ అధికారుల దాడులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

కామయ్య పాలెంలో అక్రమంగా నిల్వ ఉంచిన 10 క్వింటాల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్‌మెంట్ ఎస్ఐ సిహెచ్.రంజిత్ కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం బుధవారం తెల్లవారు జామున సివిల్ సప్లై అధికారులతో కలిసి దాడులు నిర్వహించగా సమయమంతుల సోమశేఖర్ బయట నుంచి తక్కువ ఖరీదుకు రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి, ఇంట్లో నిల్వ చేశారన్నారు. వాటిని అధిక రేట్‌కు విక్రయించడానికి సన్నద్ధం చేయగా పక్కా సమాచారం మేరకు దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో సుమారు 10 క్వింటాల నిల్వ చేసిన రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేశామన్నారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఎఎ సురేష్, సివిల్ సప్లై డిటి సురేంద్ర, విఆర్ఒ అశోక్, విఆర్ఎ షరీఫ్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

రోడ్డు విస్తరణ పనులతో ప్రజల అవస్థలు

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి సెంటర్లో జరుగుతున్న రహదారి విస్తరణ పనులతో ప్రజలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ప్రధాన సెంటర్‌లో రోడ్డుకు ఇరువైపులా ఉన్న దక్షిణ, ఉత్తర డ్రైయిన్లలో పూడిక తీత, డ్రెయిన్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ప్రొక్లెయిన్‌తో జరుగుతున్న ఈ పనుల కారణంగా పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు అనేక అవస్థలు పడుతున్నారు. సదరు కాంట్రాక్టర్ పనులు సరిగా పర్యవేక్షించకపోవడంతో ప్రొక్లెయిన్ డ్రైవర్ ఇష్టారాజ్యంగా డ్రెయిన్‌లోని మట్టిని తీసి రోడ్డుపై వేస్తున్నారు. మట్టిలోని మురుగునీరు అంతా రహదారిపై ప్రవహించడంతో రోడ్డంతా బురదమయంగా మారింది. దీంతో పాదాచారులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు రోడ్డుపై బురద వలన తరుచూ బైక్‌పై జారి పడి గాయాలు పాలవుతున్నారు. ఈ ప్రమాదంలో పిల్లలు, మహిళలు క్షతగాత్రులుగా మారుతున్నారు. బురదతో కూడిన మురుగునీటిని వాహనంలో కాంట్రాక్టర్ బయటకు తరలించాలి. అలా కాంట్రాక్టర్ చేయకపోవడంతో రోడ్డంతా మురుగు నీటితో, బురదతో నిండిపోయి రోడ్డుపై నడిచే అవకాశమే లేకుండా పోయింది. దీంతో ప్రజలు నానా అవస్థలు పడుతూ ప్రమాదాల బారిన పడుతున్నారు. ముఖ్యంగా డ్రెయినేజీ పనులు జరిగే ఈ ప్రాంతంలో బ్యాంకులు, పోలీస్ స్టేషన్, వ్యాపార దుకాణాల సముదాయాలు ఎక్కువగా ఉండడంతో జనంతో నిత్యం రద్దీగా ఉంటోంది. పెద్ద వాహనాలు రాకపోకలతో మురుగునీరు పాదచారులపై, ద్విచక్ర వాహనదారులపై, మహిళలపై పడుతోంది. ఈ బురదతో రోడ్డుపై వెళ్లే జనం నడిచే అవకాశమే లేకుండా పోతోందంటూ పలువురు మహిళలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధితాధికారులు స్పందించి ప్రజలకు ఇబ్బంది లేకుండా డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టాలని మండల ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

బురదతో అధ్వానంగా ఉన్నరోడ్డు

కుష్టువ్యాధి సర్వే సేవలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - భీమడోలు

గుండుగొలను ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో కొనసాగుతున్న కుష్టువ్యాధి సర్వే సేవలను సదరు వ్యాధి అనుమానితులు వినియోగించుకోవాలని వైద్యులు డాక్టర్ కె.శ్రీలక్ష్మి బుధవారం కోరారు. పిహెచ్‌సి పరిధిలో ఈనెల 16 వ తేదీ వరకూ కుష్టు వ్యాధి సర్వే కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఆశాలు, ఇతర సిబ్బంది, 37 ప్రత్యేక బృందాలుగా ఇంటింటికి తిరిగి సర్వే చేశామన్నారు. ఇప్పటి వరకూ 38 మంది కుష్టు వ్యాధి అనుమానితులను గుర్తించి, వారిని వైద్య పరీక్షల కోసం ప్రాథమిక కేంద్రానికి తీసుకువచ్చారన్నారు. వీరిలో 24 మందికి వ్యాధి లేనట్టు నిర్ధారించామన్నారు. మిగిలిన వారికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయవలసి ఉందన్నారు. సర్వే పూరైన తర్వాత వ్యాధిగ్రస్తులకు అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. భీమడోలు సచివాలయం-1 పరిధిలో బుధవారం నిర్వహించిన జగనన్న సురక్షలో వైద్య శిబిరాన్ని నిర్వహించి దీనిలో భాగంగా 203 మందికి వైద్య పరీక్షలు చేయగా, వీరిలో 33 మంది గర్భిణీలు, 13 మంది బాలింతలు ఉన్నారన్నారు. రోగుల అవసరాల మేరకు మందులను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో పిహెచ్‌సి ఎంపిహెచ్ఇఒ శ్రీనివాసరావు, ఎఎన్ఎం చంద్రకళ, భీమడోలు క్యాంపు కార్యాలయ సిబ్బందితో పాటు 104 సిబ్బంది పాల్గొన్నారని తెలిపారు.

కుష్టు సర్వేలో వైద్య సిబ్బంది

పింఛను కోసం వికలాంగుడి అవస్థలు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

వికలాంగుడైన కొడుకు పింఛను కోసం అవస్థలు పడుతున్నానని తండ్రి అంజి వాపోయారు. పుట్ల గట్ల గూడెంకి చెందిన గుర్రం ఏసు పుట్టుకతోనే పోలియో వచ్చి అంగవైకల్యంతో నడవలేని స్థితిలో జీవిస్తున్నాడు. రేషన్ కార్డులో గుర్రం ఏసుకు బదులు గుర్రం ఏసమ్మ అని పేరు నమోదైంది. దీంతో ప్రభుత్వం అందించే పింఛను పొందలేకపోతున్నామని తండ్రి తెలిపారు. పేరు మార్పు కోసం కొడుకును తోపుడు బండిపై నెట్టుకుంటూ ప్రభుత్వ అధికారులు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరిగి తిరిగి అలసిపోయామన్నారు. తండ్రి అంజి సహకారం ఉంటేనే బయటకు వెళ్ల లేని పరిస్థితిలో అంజికి వచ్చే పింఛనుతోనే ఇద్దరూ జీవనం సాగిస్తున్నారు. ప్రతీ రోజూ గురవాయిగూడెం మద్ది ఆంజనేయస్వామి ఆలయంలో నిర్వహించే అన్నదానం వీరిద్దరి పొట్ట నింపుతుందని చెబుతున్నారు. ఈక్రమంలో కొడుకును తోపుడు బండిపై నెట్టుకుంటూ తండ్రి అంజి పడుతున్న అవస్థలు పలువురి హదయాలను కదిలించాయి. సుమారు 20 సంవత్సరాల వికలాంగుడైన యువకుడికి నేటికి పింఛను కల్పించక పోవడం ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యమేనని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ఇటీవల పుట్లలగట్లగూడెంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎంఎల్ఎ ఎలిజా దృష్టికి ఈ సమస్య తీసుకెళ్లినా పరిష్కారం కాకపోవడం గమనార్హం. ఇప్పటికైన అధికారులు గుర్రం ఏసు సమస్యను పరిష్కరించి జగనన్న సురక్ష కార్యక్రమంలో అంగవైకల్య పింఛను ఇప్పించాలని పలువురు కోరుతున్నారు.

ఇళ్ల లబ్ధిదారులకు మట్టితోలడం లేదని ఆందోళన

ప్రజాశక్తి - నూజివీడు రూరల్

మండలంలోని బత్తులవారిగూడెంలో పట్టాలున్న నివేశన స్థలాలకు మట్టి తోలడం లేదని లబ్ధిదారులు బుధవారం ఆందోళన చేపట్టారు. గ్రామానికి చెందిన పాల మధు మాట్లాడుతూ గ్రామంలోని కొత్తచెరువు నుండి స్థానిక వైసిపి నేతలు విచ్చలవిడిగా మట్టిని అమ్ముకుని జేబులు నింపుకుంటున్నారని ఆయన ఆరోపించారు. ఇంటి స్థలాల మెరకకు మాత్రం మట్టిని తోలడం లేదన్నారు. ఈ మేరకు చెరువు గట్టుమీద గ్రామస్తులు ఆందోళన చేపట్టారు.

డిగ్రీ కళాశాలకు మల్టీ ఫంక్షన్ ప్రింటర్ వితరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

హేలాపురి లయన్స్ క్లబ్ సీనియర్ సభ్యులు లేళ్ల వెంకటేశ్వర రావు కుమారుడు లేళ్ళ కార్తీక్ జన్మదినం సందర్భముగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.19 వేల విలువ గల మల్టీ ఫంక్షన్ ప్రింటర్ (కలర్ ప్రింటర్, జిరాక్స్, స్కానర్)ను బుధవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రధానాచార్యులు డాక్టర్ జి.గిరిబాబుకు అందచేశారు. కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు దాత ఎల్.వెంకటేశ్వరరావుకు కతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమములో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ కె.అజయ్ కుమార్, వి.వెంకటరావు, ఎం.కృష్ణ చైతన్య, అధ్యాపకులు, హేలాపురి లయన్స్ క్లబ్ అధ్యక్షులు కెబి.రావు, కార్యదర్శి బివివి సత్యనారాయణ, సభ్యులు డి. హేమసుందర్, కమ్ముల ఆదినారాయణ, ఏలూరు సన్ రైజ్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు వి.సురేష్ పాల్గొన్నారు.

ప్రింటర్‌ను అందిస్తున్న క్లబ్ ప్రతినిధులు

నారుమడిలోకి చేరిన వర్షపు నీరు

పోలవరంలో భారీ వర్షం

ప్రజాశక్తి - పోలవరం

గూటాల, కొత్త పట్టిసీమ, పట్టిసీమ, పోలవరం పంచాయతీల్లో మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. పట్టిసీమ పంచాయతీ వీరభద్రాపురంలో వర్షపు నీరు బయటకు వెళ్లే మార్గం లేక, వర్షపు జలాలు నివాసాలల్లోకి చేరి ప్రజానీకం ఇబ్బందులకు గురయ్యారు. మెయిన్ బజార్లో డ్రెయినేజీ వ్యవస్థలు లేకపోవడంతో వర్షపునీరు ప్రధాన రహదారులపై ఎక్కడికక్కడ చేరి రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. పంచాయతీలోని నాలుగో వార్డులో సీసీ రోడ్లు ఉన్నా డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడం వల్ల వీధులు జలమయమవుతున్నాయని, అధికారులు స్పందించి డ్రైనేజీ వ్యవస్థలు ఏర్పాటు చేయాలని నాలుగో వార్డ్ మెంబర్ తైలం చందు కోరారు. ఇప్పటికే ఆకుమడులు వేసిన రైతులు సాగునీటి సరఫరా లేక ఆకుమడులు ఎండిపోతాయనుకునే తరుణంలో వర్షం కురవడంతో ఆనందం వ్యక్తం చేశారు.

పలుచోట్ల జగనన్న సురక్ష

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

నిమ్మలగూడెం సచివాలయ పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమం ఎంపిపి కారం శాంతి, జెడ్‌పిటిసి సభ్యులు మొడియం రామతులసి ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక సర్పంచి బన్నె బుచ్చిరాజు అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ అల్లూరి రత్నాజీరావు, సొసైటీ అధ్యక్షులు ఆరేటి సత్యనారాయణ, వైస్‌ఎంపిపి గుగ్గులోతు మోహనరావు, ఇఒపిఆర్‌డి శ్రీహరి, సచివాలయ కార్యదర్శి షేక్ రహీదా, వెల్ఫేర్ అసిస్టెంట్ చోడెం సుజాత పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెం : అర్హులైన ప్రజలందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే జగనన్న సురక్ష ముఖ్య ఉద్దేశమని ఎంపిపి కొదమ జ్యోతి అన్నారు. బుధవారం మండలంలోని శ్రీనివాసపురం, పట్టెన్నపాలెం గ్రామ సచివాలయాల వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ జగనన్న సురక్షలో ప్రజలు తమకు అవసరమైన ధృవపత్రాలు ఉచితంగా పొందొచ్చని సూచించారు. ఈ నేపథ్యంలో పలువురికి సచివాలయాల ద్వారా ఉచితంగా కుల, నివాస, ఆదాయ ధృవపత్రాలు ఉచితంగా అందజేశారు. అలాగే ప్రజల నుండి పలు ఫిర్యాదులు స్వీకరించారు.

లక్కవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి ప్రజలకు అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జీ, మండల ప్రత్యేకాధికారి ఎ.రాము, తహశీల్దార్ కె.స్లీవజోజి, ఎంపిడిఒ కిరణ్ కుమార్, మండల విద్యాశాఖాధికారులు రాములు, రాముడు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నరెడ్ల బుజ్జిబాబు, పార్టీ మండల అధ్యక్షులు వామిశెట్టి హరిబాబు, సచివాలయాల మండల కన్వీనర్ గురజాల పార్థ సారధి, సర్పంచులు పారేపల్లి నాగేంద్రబాబు, రత్నకుమారి, రాంబాబు, నాయకులు బాబీ, నాని, తన్నీరు రామకృష్ణ, రాజు, సతీష్ పాల్గొన్నారు.

ముదినేపల్లి : ప్రజా సమస్యలు పరిష్కారానికే జగనన్న సురక్ష నిర్వహిస్తున్నామని ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు అన్నారు. మండలంలోని కోడూరు సచివాలయం వద్ద సురక్ష శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, పార్టీ మండల అధ్యక్షులు ఎం.ఏసుబాబు, ఎంపిడిఒ పి.మల్లీశ్వరి, గ్రామ సర్పంచి అడుసుమిల్లి కృష్ణకుమారి, చినపాలపర్రు సర్పంచి మొవ్వ జయలక్ష్మి, ఉపసర్పంచి వల్లభనేని శేషుబాబు, పార్టీ నాయకులు తాడంకి రాజేష్, గంటా కోటేశ్వరరావు, బండి చినబాబు, జె.మరియదాస్, సాయి, రాజా, పంచాయతీ పాలకవర్గసభ్యులు పాల్గొన్నారు.


ముసునూరు మండలంలో..

కలిదిండి : సానా రుద్రవరంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమం కైకలూరు ఎంఎల్ఎ దూలం నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతలు స్వీకరించారు. అనంతరం పలువురికి వివిధ సర్టిఫికెట్లను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి చందన ఉమామహేశ్వరరావు, సర్పంచి నున్న రాజేశ్వరమ్మ, ఎఎంసి ఉపాధ్యక్షులు పాము రవికుమార్, వడ్లాని పార్థసారధి, మసిముక్కు వెంకటేశ్వరరావు, నున్న కృష్ణబాబు, నీలపాల భోగేశ్వరరావు, సంబంధిత శాఖాధికారులు పాల్గొన్నారు.

ముసునూరు : వైసిపి మండల కన్వీనర్ వరికూటి ప్రతాప్ ఆధ్వర్యంలో జగనన్న సురక్ష కార్యక్రమం అక్కిరెడ్డిగూడెం సచివాలయంలో జరిగింది. కార్యక్రమంలో వైస్‌ఎంపిపి కోటగిరి రాజానాయన, సర్పంచులు, ఎంపిటిసిలు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు..

చింతలపూడి : ప్రజల వద్దకే పాలన అందించిన ఘనత సిఎం జగన్‌కు దక్కుతుందని చింతలపూడి ఎంపిపి బి.రాంబాబు అన్నారు. వడ్లగూడెం సచివాలయం వద్ద జగనన్న సురక్ష కార్యక్రమం గ్రామ సర్పంచి కొండే బోయిన యువరాజు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు అవసరమైన సర్టిఫికెట్లను అందజేశారు. ముందుగా సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో చింతలపూడి మండల సచివాలయాల కన్వీనర్ చల్లా బత్తుల శ్రీనివాసరావు, ఉర్లగూడెం ఎంపిటిసి నారపాము మల్లేశ్వరరావు, ఎంపిడిఒ ఎం.మురళీకృష్ణ, ఎపిఎం జ్యోతి వెంకాయమ్మ, ఎపిఒ మోహిని కుమారి, మండల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.


కలిదిండి మండలంలో..


బుట్టాయగూడెం మండలంలో..

సమస్యలపై క్రియాశీల పోరాటాలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికై ఏపిటియుసి క్రియాశీల పోరాటాలు నిర్వహిస్తుందని యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు అన్నారు. ఉద్యోగుల సమస్యలపై 33 ఏళ్లుగా ఉద్యమం చేస్తూ, ఎన్నో విజయాలు సాధించిన ఏపిటియుసి అనుబంధ ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ 34 వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఏలూరు కోట దిబ్బ సర్వీస్ రిజర్వాయర్-1 వద్ద బుధవారం ఘనంగా నిర్వహించారు. జాతీయ పతాకాన్ని డిఇఇ పింగల కొండలరావు, ది జోనల్ మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ పతాకాన్ని ఏపిటియుసి ఏలూరు జిల్లా కన్వీనర్, యూనియన్ గౌరవ అధ్యక్షులు బండి వెంకటేశ్వరరావు ఆవిష్కరించారు. యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు అధ్యక్షత వహించిన సభలో బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఏపిటియుసి ప్రైవేటీకరణ విధానాలకు వ్యతిరేకంగా కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగ సిబ్బందిని రెగ్యులర్ చేయాలని పోరాడుతుందన్నారు. డిఇఇ పి.కొండలరావు, యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎ.అప్పలరాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిఇఇ తాతబ్బాయి, ఫిట్టర్లు దుర్గారావు, సుబ్బారావు, కె.రామకృష్ణ, సాంబ పాల్గొన్నారు.

రాష్ట్ర సదస్సును జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం నిలిపివేసిన భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ పథకాలు తిరిగి అమలు చేయాలని కోరుతూ ఈనెల 12న విజయవాడలో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని ఐఎఫ్‌టియు జిల్లా కమిటీ తెలిపింది. ఐఎఫ్‌టియు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కమిటీ సమావేశం బుధవారం ఏలూరు ఇఫ్టూ కార్యాలయంలో కెవి రమణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో ఐఎఫ్‌టియు రాష్ట్ర సహాయ కార్యదర్శి యు.వెంకటేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భవన నిర్మాణ కార్మికులకు గత చంద్రబాబు గానీ, నేటి జగన్ ప్రభుత్వం గానీ తీవ్ర అన్యాయం చేశారని విమర్శించారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు పి.నాగేశ్వరరావు, ఎస్.రామ్మోహన్, ఎం.నాగరాజు పాల్గొన్నారు.

ఘనంగా హౌసింగ్ శాఖ వార్షికోత్సవం

భీమవరం రూరల్ : రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో ఎంతోమంది నిరుపేదలకు లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిందని ఆర్‌డిఒ దాసి రాజు అన్నారు. రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ 45వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ఎండి ఆదేశాల మేరకు బుధవారం స్థానిక ఛాంబర్ ఆఫ్ కామర్స్‌లో గృహ నిర్మాణ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆర్‌డిఒ దాసి రాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ నిర్మాణ సంస్థ ద్వారా 1979 నుంచి గూడు లేని నిరుపేదలకు అనేక లక్షల ఇళ్ల నిర్మాణం చేపట్టిందన్నారు. నేడు చేపట్టిన ఇళ్ల నిర్మాణం దేశంలోనే మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు అందించారు. రిటైర్డ్ ఉద్యోగులును శాలువతో సత్కరించి మెమెంటోలు అందించారు. అనంతరం రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు 12 మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని గృహ నిర్మాణ సంస్థ ఉద్యోగులు పిడి పిచ్చియ్య, ఇఇ, డిఇఇ, ఎఇ, వర్క్ఇన్‌స్పెక్టర్, డిఇఒలు పాల్గొన్నారు.

'శ్రీవాసవి'లో ప్రాంగణ ఎంపికలు

తాడేపల్లిగూడెం: స్థానిక శ్రీ వాసవి జూనియర్, డిగ్రీ కళాశాలలో బుధవారం ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. చెన్నై, తిరుపతిలలో ఉద్యోగాల నిమిత్తం జివిఎల్ కంపెనీవారు ప్రాంగణ ఎంపికలు నిర్వహించారు. మొత్తం వంద మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరవ్వగా వారిలో 15 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఎంపికైన వారికి కళాశాల ప్రిన్సిపల్ ఎం.రామకృష్ణ, ఉమ సుబ్రహ్మణ్యం, అధ్యాపకులు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఛైర్మన్ రమణరావు మాట్లాడుతూ విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి విద్యార్థులకు వివిధ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పించడమే తమ లక్ష్యమని చెప్పారు.

దస్తావేజులు పోయినవి

గుంటూరు జిల్లా, పాతగుంటూరు కాపురస్తులు అయిన షేక్ అస్మత్, W/o. రియాజ్ అను నాకు చినపాలపర్రు **డాక్యుమెంట్ నంబర్స్ 247/2, 248** అను డాక్యుమెంట్స్ మా అబ్బాయి బైక్ సీట్ బాగ్‌లో పెట్టుకొని వస్తుండగా దారిలో పడిపోయినవి. ఎంత వెతికినా దొరకలేదు. కావున మా ఈ దస్తావేజులు (ఆస్తి పత్రాలు) దొరికినవారు ఈక్రింది ఫోన్ నంబర్స్‌కు తెలియజేయవలసిందిగా కోరుచున్నాము. ఈ దస్తావేజులు ఎవరికైనా దొరికినా అవి ఉపయోగపడవు.

షేక్ అస్మత్, భర్త: రియాజ్
పాత గుంటూరు, గుంటూరు
సెల్: 9381265060, 9603133236
9014594876